క్లుప్తంగా

## భక్తులకు మెరుగైన సేవలందించాలి


ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను కలిసిన జిల్లా దేవదాయ శాఖాధికారి సుబ్బారావు

సాక్షి, భీమవరం : జిల్లా దేవదాయ శాఖాధికారిగా నియమితులైన ఈవీ సుబ్బారావు సోమవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవాలయాల్లో భక్తులకు ఆధ్యాత్మికత ఉట్టిపడే విధంగా ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు మెరుగైన సేవలందించడం ద్వారా దేవదాయ శాఖాధికారులు మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. భక్తులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు దేవాలయాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎండోమెంట్స్ ఇన్‌స్పెక్టర్ వర్ధినీడి సత్యనారాయణ, ఈవో తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో చండీహోమం


చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం


భీమవరం (ప్రకాశంచౌక్) : భీమవరం మెంటేవారి తోటలోని శ్రీబాలత్రిపుర సుందరిదేవి అమ్మవారి దేవస్థానంలో జ్యేష్ఠ మాస పౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తిశ్రద్ధలతో చండీహోమం నిర్వహించారు. అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అధ్వర్యంలో బాలిశెట్టి నాగేశ్వరరావు, రంగమాంబ దంపతులచే నవార్చన, శివనాగ ధనరాజ్ (నాని)చే అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేద మంత్రాల నడుమ చండీహోమం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

## ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలి


అతిసార నియంత్రణ పక్షోత్సవాలలో మాట్లాడుతున్న డాక్టర్ గులాబీ రాజ్ కుమార్

కాళ్ల : ప్రతి ఆశ కార్యకర్త తన పరిధిలోని ఐదేళ్ల పిల్లలు ఉన్న ప్రతి ఇంట్లోనూ ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని డాక్టర్ గులాబీ రాజ్‌కుమార్ తెలిపారు. అతిసార నియంత్రణ పక్షోత్సవ కార్యక్రమాన్ని కాళ్లలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డయేరియా వచ్చిన పిల్లలకు 14 రోజుల పాటు జింక్ మాత్రలను అందించాలన్నారు. పక్షోత్సవ కార్యక్రమాలను ఈనెల 17 వరకు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి గ్రామంలోనూ సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఓఆర్ఎస్, జింక్ కార్నర్లు ఏర్పాటు చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## క్షీరారామలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకరణలో దర్శనమిచ్చిన శివయ్య

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి స్వామివారికి అభిషేకాలు, జనార్ధనస్వామికి అర్చనలు, లక్ష్మీపార్వతి అమ్మవార్లకు కుంకుమ పూజలు, గోపూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. రాత్రి 7 గంటలకు స్వామివారికి పంచహారతులు ఇచ్చారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి యళ్ల సూర్యనారాయణ పాల్గొన్నారు.

## పాఠశాలలకు జగనన్న విద్యాకానుక కిట్లు

పోడూరు: వేసవి సెలవుల అనంతరం త్వరలో ప్రభుత్వ పాఠశాలలు తిరిగి తెరుచుకోనున్నాయి. పాఠశాలలు తెరిచిన వెంటనే విద్యార్థులకు 'జగనన్న విద్యాకానుక' కిట్లు పంపిణీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ చర్యల్లో భాగంగా ఇప్పటికే పోడూరు మండల కేంద్రంలోని స్టాక్‌పాయింట్‌కు విద్యాకానుక సామాగ్రి సరఫరా చేశారు. స్టాక్ పాయింట్ నుంచి మండలంలోని పలు పాఠశాలలకు సోమవారం విద్యా కానుక కిట్లు తరలింపు చేపట్టారు. ఎంఈఓ ప్రేమజ్యోతి పర్యవేక్షణలో సీఆర్‌పీలు, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు కిట్ల పంపిణీ పనులు నిర్వహిస్తున్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

సాక్షి, భీమవరం : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా విద్యా శాఖాధికారి ఆర్.వెంకటరమణ అన్నారు. పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, ప్రపంచ పర్యావరణ దినోత్సవం వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి, సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. డీఈవో వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థి దశనుంచి పర్యావరణం పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలునాటి వాటిని సంరక్షించాలన్నారు. అనంతరం డ్రాయింగ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రాలు, మొక్కలు అందజేశారు. కార్యక్రమంలో మల్లుల శ్రీనివాస్, ఎం.సీతారామరెడ్డి, వి.వాణిశ్రీ, గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు, అరసవల్లి సుబ్రహ్మణ్యం, చెరుకువాడ రంగసాయి, లక్ష్మి, తోట సతీష్, ఎం.మృదుల, ఎస్.కృష్ణ, డి.రామనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా పర్యావరణ దినోత్సవం

పట్టణంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. వివిధ విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మొక్కలు నాటడం, ర్యాలీ నిర్వహించడం ద్వారా మొక్కల ఆవశ్యకతను వివరించారు. ఈసందర్భంగా ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో వాసవి క్లబ్ సహకారంతో మొక్కలను నాటారు. కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్ రంగరాజు మాట్లాడుతూ మొక్కలు నాటడమే గాకుండా వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో వి.చంద్రశేఖర్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కేవీ మల్లి కృష్ణంరాజు, పి.భవాని, వాసవి క్లబ్ అధ్యక్షుడు మానేపల్లి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

### భారతీయ విద్యాభవన్స్ స్కూల్లో...

పట్టణంలోని భారతీయ విద్యాభవన్స్ స్కూల్లో సైన్స్ క్లబ్, ఎన్‌సీసీ, నేవీ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ ఎల్.రమాదేవి, యు.రామకృష్ణంరాజు మాట్లాడుతూ ప్లాస్టిక్ నియంత్రణ, మొక్కలు నాటడం ద్వారా కాలుష్యాన్ని అరికట్టవచ్చునన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఏవో యుఆర్‌కే రాజు, పైడిరాజు, జీవీజీ శర్మ, గీతాంజలి పాండా, దుర్గాప్రసాద్, దేవిపద్మ తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి

సాక్షి, భీమవరం : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా భీమవరం మండల న్యాయ సేవాధికారసంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ఆవరణలో సోమవారం ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.సురేష్‌బాబు మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. 50వ పర్యావరణ దినోత్సవాన్ని బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్ అనే థీమ్‌తో ప్రపంచంలో అన్ని సంఘాలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. ప్లాస్టిక్ సంచులకు బదులు క్లాత్ సంచులను, జూట్ బ్యాగులను వినియోగించాలని గాలి, నీరు కాలుష్యం గాకుండా సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి పి.రమేష్‌బాబు, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఎస్.సుధీర్, లోక్ అదాలత్ సభ్యులు వీవీ సుబ్బారావు, వి కరుణాకర రావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎ.అనురాధ, అడ్మినిస్ట్రేటివ్ అధికారి సురేష్, వైస్ ప్రిన్సిపాల్ మావుళ్ళు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

భీమవరం (ప్రకాశంచౌక్) : ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా భీమవరం పురపాలక సంఘం, యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పురపాలక సంఘ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ, ఆర్డీవో దాసి రాజు పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకత, ప్లాస్టిక్ వాడకం వల్ల అనర్థాలను వివరించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించామని, తడి చెత్తను ప్రజలు వారి ఇంటి వద్దనే సేంద్రియ ఎరువుగా మార్చుకోవాల్సిందిగా కోరారు. పెరుగుతున్న పర్యావరణ కాలుష్యం వల్ల వాతావరణంలో అనేక రకాల మార్పులు వచ్చి ఓజోన్ పొర క్షీణించిందని తద్వారా ఉష్ణోగ్రతలు పెరిగాయన్నారు. అందరూ తమ పరిధి మేర మొక్కలు పెంచడంతో పచ్చదనం పెరిగి వాతావరణం సమతుల్యంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, యూత్ హాస్టల్స్ సభ్యులు పాల్గొన్నారు.


భీమవరం : గ్రంథాలయంలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందచేస్తున్న డీఈవో వెంకటరమణ

### ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ర్యాలీ

ఆకివీడు : పర్యావరణాన్ని కాపాడుకోవలసిన బాధ్యత మనపై ఉందని ప్రిన్సిపాల్ కే.సుజాత పిలుపునిచ్చారు. దుంపగడప గ్రామంలోని వీవీ.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో పర్యావరణ పరిరక్షణపై ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, అధ్యాపకులు ర్యాలీ నిర్వహించారు. ఓజోన్ పొర రక్షణకు పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు టి.ఓగేశ్వరరావు, కె.ఆనంద కుమార్, కె.బాలగురవయ్య, యు.శ్రీనివాసరావు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

ప్లాస్టిక్ వాడకాన్ని విద్యార్థులు సైనికుల్లా అడ్డుకోవాలని లయన్స్ ప్రతినిధులు డీవీ.సత్యనారాయణ, నెల్లి సతీష్ పిలుపునిచ్చారు. స్థానిక మాదివాడ శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎన్ని మొక్కల్ని పెంచినా ప్లాస్టిక్ భూతం భూమిని నాశనం చేస్తుందన్నారు. మానవాళి మనుగడ ఉన్నప్రాంతాల్లో ప్లాస్టిక్ భూతం భూమిలో అడుగున్నర వరకూ పేరుకుపోయిందన్నారు. దీని వాడకాన్ని పూర్తిగా నిషేధించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో గ్రంథ పాలకురాలు పార్వతి పాల్గొన్నారు.


భీమవరం : ఎస్ఆర్‌కేఆర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం



భీమవరం : ఆదిత్య డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న జడ్జి సురేష్‌బాబు


భీమవరం (ప్రకాశం చౌక్) : మున్సిపల్ కార్యాలయం వద్ద పర్యావరణ ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



ఆకివీడు : ర్యాలీ నిర్వహిస్తున్న దుంపగడప వీవీ.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

## ముగిసిన లలిత కళల శిక్షణ


విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్) : ఏఎస్ఆర్ నగర్‌లోని అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో గత 30 రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత లలిత కళల శిక్షణా శిబిరం సోమవారం ఘనంగా ముగించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ మాట్లాడుతూ లలిత కళలపై ఉచిత శిక్షణ నిర్వహించడం అభినందనీయమన్నారు. కేంద్రం అధ్యక్షుడు గాదిరాజు సుబ్బరాజు మాట్లాడుతూ నెల రోజులపాటు విద్యార్థులకు ఉచితంగా యోగా, కరాటే, డాన్స్, డ్రాయింగ్, చదరంగంపై ఉచితంగా శిక్షణ నిర్వహించామన్నారు. ఈ శిబిరంలో సుమారు 350 మంది విద్యార్థులు వివిధ కళల్లో శిక్షణ తీసుకున్నారని తెలిపారు. అనంతరం విద్యార్థులకు కమిషనర్ శివరామకృష్ణ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ ఝాన్సీ లక్ష్మి, సీహెచ్ ఏవీడీ సుబ్రహ్మణ్యంరాజు, నడింపల్లి సుబ్బరాజు, ముదుండి సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే లక్ష్యం

- భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్
- వినాయక్‌నగర్‌లో సీసీ రోడ్లు ప్రారంభం

భీమవరం అర్బన్ : గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సీసీ రోడ్లు, సచివాలయాలు, ఆర్‌బీకే, రైతు భరోసా కేంద్రాలు, డ్రెయినేజీలు ఏర్పాటు చేశామని, గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తున్నామని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని కొవ్వాడ పుంత గ్రామంలో వినాయక నగర్ పరిధిలో రూ.40 లక్షలతో నిర్మించిన మూడు సీసీ రోడ్లను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో అభివృద్ధిని కాగితాలలో చూపించడం లేదని చేసి చూపిస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి రాష్ట్ర ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. రెండేళ్లు కరోనా ప్రభావం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై తీవ్రంగా పడినా దాని ప్రభావం ప్రజలపై పడకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రతి కుటుంబానికి రూ.50 వేలు నుంచి రూ.5 లక్షల వరకు లబ్ధి చేకూర్చి ఆర్థికంగా ఎదిగే విధంగా చేసి ఆర్థిక సునామీ సృష్టించారన్నారు. ఒక పక్క సంక్షేమ పథకాలు అమలు చేస్తూ మరో పక్క గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చేస్తూ సీఎం వైఎస్ జగన్ ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. నియోజకవర్గంలో ప్రజల కోరిక మేరకు, వారి సూచనల ప్రకారం అభివృద్ధి చేస్తున్నామన్నారు. నూతనంగా జిల్లా ఏర్పడటం దానికి కేంద్రంగా మన భీమవరాన్ని సాధించుకోవడం ఇది ప్రజల విజయమని, ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నియోజకవర్గ, జిల్లా ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, తహసీల్దార్ వై.రవికుమార్, పట్టణ కన్వీనర్ తోట భోగయ్య, యాదవ సంఘం అధ్యక్షుడు గోరిపర్తి సత్యనారాయణ, మన్నే నాగేశ్వరరావు, ఎస్.,శ్రీను (చిన్నకారు), కొండేపూడి త్రిమూర్తులు, సబ్బిశెట్టి సుభాకర్, కందుల భాస్కరరావు, ఎండీ తాజుద్దీన్ బాబా, జి.గంగరాజు, పెద్దిబోయిన సుబ్రహ్మణ్యం, డీకే ప్రసాద్, కార్యదర్శి డీకేవీ ప్రసాద్, ఏఎస్ రాజు, కొట్టి కుటుంబరావు, మండల జేఏసీ కన్వీనర్ కోమటి రాంబాబు, కొట్టి కుటుంబరావు, గంటా సుందర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


వినాయక్ నగర్‌లో సీసీ రోడ్డుకు సంబంధించి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

## వ్యక్తికి గాయాలు

సాక్షి, భీమవరం : బీరు బాటిల్‌తో దాడి చేయడంతో ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. టూటౌన్ సీఐ బి.కృష్ణకుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని బజాజ్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్న గెద్దం కిషోర్‌కుమార్ ఆదివారం రాత్రి పట్టణంలోని ఒక ప్రాంతంలో మద్యం సేవిస్తుండగా ఆకుల గణేష్ అనే వ్యక్తి బీరుబాటిల్‌తో కొట్టడంతో గాయపడ్డాడు. బాధితుడు కిషోర్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

### పేకాట స్థావరంపై దాడి

ఉండి : ఉండి మండలం చెరుకువాడలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై సోమవారం ఉండి పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.7,300 నగదు, ఒక ద్విచక్ర వాహనం, నాలుగు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఆకివీడు రూరల్ సీఐ గీతాకృష్ణ తెలిపారు.

### బాలుడికి గాయాలు

ఆకివీడు : మోటార్‌సైకిల్ ఢీకొన్న ఘటనలో సోమవారం ఓ బాలుడికి గాయాలయ్యాయి. వివరాల ప్రకారం పెదపేటకు చెందిన ఏడేళ్ల బాలుడు స్థానిక ప్రధాన సెంటర్‌లో రోడ్డు దాటుతుండగా కైకలూరు నుంచి భీమవరం వైపు వెళుతున్న మోటార్ సైకిల్ ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలుడికి కాలు విరిగింది. చికిత్స కోసం స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందలేదని ఎస్సై రాజారెడ్డి చెప్పారు.


కంప్యూటర్ శిక్షణ పొందిన విద్యార్థులతో విఠల్ రంగరాజు తదితరులు

## ముగిసిన శిక్షణ

సాక్షి, భీమవరం : అందుబాటులో ఉన్న అవకాశాలు సద్వినియోగం చేసుకొని విద్యార్థులు విజ్ఞానవంతులు కావాలని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్ రంగరాజు అన్నారు. కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు కంప్యూటర్ ప్రోగ్రామింగ్, సి లాంగ్వేజ్‌పై నాలుగు రోజుల ఉచిత శిక్షణ ముగింపు సందర్భంగా సోమవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కేవి మురళీకృష్ణంరాజు, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ హెడ్ వి.చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు భవిష్యత్తులో కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరిగా గుర్తించి తమ కళాశాలలో ఉచిత శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కె.రఘుసీతారామరాజు, సీహెచ్ రఘు, డీవీఎస్ రాజు, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

# నేడు అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ

సాక్షి, భీమవరం : పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన 10 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించనున్నారు. సుమారు 50 ఏళ్ల క్రితం ఇక్కడ ఏర్పాటుచేసిన అంబేడ్కర్ సిమెంట్ విగ్రహాన్ని తొలగించి ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ భీమవరం మండలశాఖ ఆధ్వర్యంలో కాంస్య విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని, ఈసందర్భంగా నిర్వహించే సభకు కలెక్టర్ పి.ప్రశాంతి అధ్యక్షత వహిస్తారని అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.వీరయ్య విలేకర్లకు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ యు రవిప్రకాష్, ఉస్మానియా యూనివర్శిటీ ప్రొఫెసర్ సి.కాసిమ్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి తాటిపాక గోపాలరావు, ఐఈఎస్ అధికారి కుచనపల్లి రమేష్‌బాబు, జాయింట్ కలెక్టర్ ఎస్ రామ్‌సుందర్‌రెడ్డి. డీఆర్వో కె కృష్ణవేణి, ఆర్డీవో దాసి రాజు, డీఎస్పీ బండారు శ్రీనాథ్, మునిసిపల్ కమిషనర్ సబ్బి శివరామకృష్ణ తదితరులు పాల్గొంటారన్నారు.


ఆవిష్కరణకు సిద్ధం చేసిన అంబేడ్కర్ కాంస్య విగ్రహం

### ట్రాఫిక్ మళ్లింపు

సాక్షి, భీమవరం : పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ దృష్ట్యా ట్రాఫిక్ రద్దీ లేకుండా మళ్లింపు చర్యలు తీసుకున్నట్లు ట్రాఫిక్ సీఐ జి.దాసు తెలిపారు. మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 9 గంటల వరకూ ప్రకాశం చౌక్ సెంటర్, నటరాజ్ థియేటర్, టౌన్ రైల్వే స్టేషన్ రోడ్డు సెంటరు, టూటౌన్ పోలీస్ స్టేషన్, బొంబే స్వీట్ వై.జంక్షన్ వద్ద, డీ మార్టు రోడ్లు మూసివేయనున్నామని తెలిపారు. డీఎస్పీ ఆదేశాల మేరకు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకున్నామని ప్రయాణికులు, వాహనదారులు సహకరించాలని ట్రాఫిక్ సీఐ దాసు కోరారు.

## మంచినీటి చెరువు విస్తరణ పనుల ప్రారంభం

పాలకొల్లు అర్బన్: మంచినీటి చెరువు విస్తరణతో గ్రామ ప్రజల తాగునీటి అవసరాలు పూర్తిగా తీరినట్లేనని సర్పంచ్ కవురు భారతి అన్నారు. మండలంలోని కొత్తపేట పంచాయతీ మంచినీటి చెరువు విస్తరణ పనులను సోమవారం ఆమె కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. గతంలో ఎకరంన్నరలో మంచినీటి చెరువు వుండేది. దీంతో వేసవి కాలంలో గ్రామ ప్రజలకు మంచినీటి అవసరాలు పూర్తిగా తీరేవి కావు. ఈ సమస్యను పరిష్కరించడానికి సర్పంచ్ భారతి, వైఎస్సార్ సీపీ నాయకులు కవురు భాస్కరబాబు తదితరులు గ్రామానికి చెందిన గొల్లమందుల పోలు అనే రైతు నుంచి సుమారు 20 సెంట్లు భూసేకరణ చేశారు. చెరువు విస్తరణకు మార్గం సులువైంది. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పెదపాటి వెంకటరత్నం, మాజీ సర్పంచ్ దాసరి లాజరు, పంచాయతీ కార్యదర్శి ఓదూరి సూర్యప్రకాశరావు (రాజా), గ్రామ పెద్దలు కవురు గాంధీ, యాండ్ర రామకృష్ణ, ధనకొండ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## చురుగ్గా కాలువలో పూడికతీత పనులు

నరసాపురం రూరల్: నరసాపురం ప్రధాన పంట కాలువ పూడిక తీత పనులు చురుగ్గా జరుగుతున్నాయి. గత నెల 19న ప్రారంభమయిన ఈ పనులు సీతారాంపురం సెంటర్‌వరకూ దాదాపు పూర్తికావచ్చాయి. నరసాపురం మేదర్ల వంతెన వద్ద నుంచి మొగల్తూరు వరకూ ఈ కాలువలో ఉన్న గుర్రపుడెక్క, చెత్త తొలగించి పూడికతీతను యంత్రం సాయంతో తీస్తున్నారు. నీటి ప్రవాహానికి ఆటంకం కలుగకుండా ఉండే విధంగా కాలువ పూడిక తీత కోసం రూ.28 లక్షల నిధులతో ఈ కాలువ ప్రక్షాళన పనులు చేపట్టారు. దిగువ ప్రాంతాల రైతులకు తాగునీటి ప్రాజెక్టులు చెరువులు నింపేందుకు ఈ కాలువ పూడిక తీత ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు, ఆయా ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ప్లాస్టిక్ విడనాడి పర్యావరణం కాపాడదాం


కేవీకేలో మాట్లాడుతున్న డాక్టర్ మల్లికార్జునరావు

ఉండి: పర్యావరణాన్ని కాపాడాలంటే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాల్సిందేనని కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ మల్లికార్జునరావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని సోమవారం ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం కృషీ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడమే ఈ ఏడాది ప్రధాన అజెండా అన్నారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, రీసైక్లింగ్, రీయూజ్ వంటివి తప్పక చేపట్టాలన్నారు. కీటక శాస్త్రవేత్త డాక్టర్ వి.రాజేష్ మాట్లాడుతూ పర్యావరణంలో పెనుమార్పులు సంభవించడానికి ప్రధాన కారణాలు ప్లాస్టిక్ వినియోగం, అధిక పురుగుమందుల వినియోగం, అధిక విద్యుత్ వినియోగమని అన్నారు. ఈ కార్యక్రమంలో పంటల యాజమాన్య శాస్త్రవేత్త పీ వినయలక్ష్మీ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. డాక్టర్ ఏ శ్రీనివాస్ మాట్లాడుతూ చేపల పెంపకంలో సేంద్రియ పద్ధతులు పాటించి పర్యావరణాన్ని కాపాడుకుందామన్నారు. పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.